ప్రజాశక్తి
మంగళవారం 15 నవంబర్ 2022
5
అల్లూరి సీతారామరాజు



సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-అనంతగిరి: కవర్ల, పెద్దకోట, పినకోట పంచాయతీల పరిధి గ్రామాలలో రోడ్డు, తాగునీటి వంటి మౌలిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, దేవరపల్లి మెయిన్ రోడ్డు నుండి జీనబాడు మీదుగా కొరపర్తి, బొంగిజా గ్రామం వరకు రోడ్డు పనులు చేపట్టాలని సోమవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు విన్నవించినట్లు పిన్నకోట సర్పంచ్ గణేష్, కవర్ల సర్పంచ్ పుట్టబోయిన. ముత్యాలమ్మ, పెద్దకోట సర్పంచ్ సిరిగం అన్నపూర్ణ దేవి, వైస్ ఎంపీపీ శకుంతలు స్థానిక విలేకరులకు తెలిపారు. సర్పంచ్‌లు మాట్లాడుతూ, మారుమూల పంచాయతీ గ్రామాల్లో రోడ్డు, తాగునీరు లేక గిరిజన ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతు న్నారని తెలిపారు.



వినతిపత్రం ఇస్తున్న ప్రజాప్రతినిధులు

ఘనంగా బాలల దినోత్సవం



హుకుంపేటలో బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: భారతదేశ మొట్టమొదటి ప్రధాని నెహ్రూ జయంతి వేడుకలను పురస్కరించుకుని అల్లూరి జిల్లా వ్యాప్తంగా సోమవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు చిన్నారులను అభినందించారు. చదువుకుంటేనే పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తలారిసింగి జిటిడబ్ల్యూ బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం రీమలి జాన్, పాడేరు మండలం కందమామిడి జిటిడబ్ల్యూ బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం గంగబాయ్ అన్నారు. పాఠశాలల్లో సోమవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో హెచ్‌ఎం జాన్ మొక్కలను నాటారు. కందమామిడి బాలికల పాఠశాలలో వివిధ సాంస్కతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుకుంపేట: విద్యతో పాటు క్రీడా రంగంలో కూడా విద్యార్థులు ముందుకు సాగాలని విద్యాశాఖ అధికారి ఎస్.పూర్ణ చంద్రరావు అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో బాలల దినోత్సవ సందర్భంగా మండల్ లెవెల్ స్పోర్ట్స్, సంస్కతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ కోఆర్డినేటర్ విజయరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకుని ఆటలు పోటీలు, వ్యాసరచనలు నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజే శామని స్థానిక పాఠశాల 2 ప్రధానోపాధ్యాయులు బి. మంగ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండల కేంద్రంలో మూడు రోడ్ల జంక్షన్ కూడలి వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ సువర్ణమ్మ మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి పౌరులు అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్వాడి సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని కొండవీధి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ కొర్ర ప్రసన్నకుమార్, పెదలబుడు పంచాయతీ మాజీ ఎంపిటీసీ బురిడీ కోగేశ్వరరావు మాట్లాడారు. దేశానికి దిశ, దశ నిర్దేశించేది బాలలే అన్నారు. అనంతరం వివిధ సాంస్కతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు.

డుంబ్రిగూడ: మండలంలోని కించుమండ స్కూల్ కాంప్లెక్స్ పరిధి కొసంగుడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పీతల విలియమ్ కేరీ ఆధ్వర్యాన బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు పీతల విలియమ్ కేరీ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర ఉద్యమంలో నెహ్రూ కీలక పాత్ర పోషించారని కొనియాడారు.



పెదబయలులో..

పెదబయలు: స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో నెహ్రూ జయంతి వేడుకలు ప్రిన్సిపాల్ శంకరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
వడ్డేపుట్టు జిపిఎస్ ప్రభుత్వ పాఠశాల, బంగారు మెట్ట ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గిరి బాల నేస్తం పేరుతో ప్రతి ఏడాది గిరిజన మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన బాలల దినోత్సవం నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామని మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు తల్లాపు కౌసల్య తెలిపారు. గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్విరాజు మాట్లాడుతూ, విద్యార్థుల వికాసానికి ఎంతగానో దోహదపడే ఇటువంటి కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. గిరిజన మహిళ సంఘం నాయకులు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బంగారు మెట్ట పాఠశాల చైర్మన్ లక్ష్మి, కొండమ్మ, పుష్ప పాల్గొన్నారు.

హుకుంపేట: జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలను అధికారికంగా నిర్వహించాలని హెచ్‌ఆర్‌సి సంస్థ జిల్లా సమన్వయకర్త టి.కృష్ణారావు తెలిపారు. కొట్నాపల్లి ఎంపియుపి పాఠశాలలో పార సంస్థ అధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఉపాధ్యాయులు జి.ఉమామహేశ్వరరావు కేకు కట్ చేశారు. సంస్థ జిల్లా సమన్వయ కర్త టి.కృష్ణారావు మాటాడుతూ, దినోత్సవాలను అధికారికంగా నిర్వహించి, ఆయా దినాల ప్రాముఖ్యతను తెలియ జేయాలన్నారు.


రంపచోడవరం: మండలంలోని ముసురిమిల్లి పంచాయతీ చిన్న భారంగి మేరీ ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వంశి కుంజం పాల్గొని దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పులమాల వేసి నివాళులర్పించారు. పిల్లలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలకు లెక్కలు, ఎక్కాలు, నృత్యం పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యాలయంలో సర్పంచ్ కోసు రమేష్ బాబు దొర, వార్డ్ మెంబరు సత్యవతి, వైసిపి నాయకులు రాజన్న దొర, బొబ్బా శేఖర్, స్కూల్ విద్య కమిటీ చైర్మన్ ముర్ల పద్మావతి, సూర్య చంద్ర భాస్కర టర్జాన్, హెడ్ మాస్టర్ విశ్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని పెదమాకవరం ఆశ్రమ పాఠశాలలో బాలల దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు బాక్సులు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీలేరు: జీకే వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రామచంద్రరావు ఆధ్వర్యాన బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. పండిత నెహ్రూ పోరాటపటిమ, ఆయన గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం బాలలు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న రాజ్యలక్ష్మి తన ఐదు నెలల మనవరాలిని శివుని రూపంలో అలంకరించింది.

చింతూరు: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతూరు సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సోమవారం స్థానిక ఏజిహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో వివిధ ఆటల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పుస్తకాలు, మిఠాయిలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని దశలోనే అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఏజిహెచ్‌ఎస్ ప్రధాన ఉపాధ్యాయురాలు కృష్ణవేణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మారేడుమిల్లి: బాలల దినోత్సవం సందర్భంగా మండలంలోని తాడేపల్లి పంచాయితీ పరిధి కేవిలంక ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు వైసిపి మండల యూత్ నాయకుడు దూడ స్మిత్ సోమవారం పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్య కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు సాల్మన్, ఆండ్రియా పాల్గొన్నారు.



రంపచోడవరంలో బహుమతులు ఇస్తున్న ఉపాధ్యాయులు

బాలల దినోత్సవం రోజున తెరవని పాఠశాలలు

ప్రజాశక్తి హుకుంపేట: బాలల దినోత్సవం రోజున మండలంలోని భీమవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తెరువలేదు. సోమవారం ఉదయం 11 గంటలు సమయం కావస్తున్నా ఉపాధ్యాయుడు రాక పోవడంతో విద్యార్థులు ఎదురు చూశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.
అలాగే బి.తాడేపుట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఇద్దరు ఉపాధ్యాయులు కూడా విధులకు హాజరు కాలేదు. బాలల దినోత్సవం నాడు పాఠశాలలకు తాళాలు వేయడం భావ్యమా అని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఒకేరోజు విధులకు రాకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపం కారణంగానే పాఠశాలకు ఉపాధ్యాయులు డుమ్మా కొడుతున్నారని తెలిపారు.
ఈ విషయంపై స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో హెచ్‌ఎం ఉషారాణిని వివరణ కోరగా.. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సత్యవతి సెలవు మంజూరుకు తమను సంప్రదించారని ఆమె అన్నారు..
మండల విద్యాశాఖ అధికారిని వివరణ కోరగా భీమవరం, బి.తాడేపుట్టు ప్రథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సెలవు కొరకు తనను సంప్రదించలేదని తెలిపారు. ఆయా పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సెలవు మంజూరుకు దరఖాస్తులు ఇవ్వాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి విషయాలు పై ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు



బి.తాడేపుట్టులో తెరవని పాఠశాల



పంచాయతీ కార్యదర్శికి సమ్మె నోటీసు ఇస్తున్న వెంకట్, కార్మికులు

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్
- పంచాయతీ కార్యదర్శికి సమ్మె నోటీసు

ప్రజాశక్తి- చింతూరు
చింతూరు గ్రామ సచివాలయ పరిధిలోని పనిచేస్తున్న 13 మంది కార్మికులకు తక్షణమే 11 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. తక్షణమే వేతనాలు చెల్లించకపోతే 22వ తేదీ నుండి విధులను బహిస్కరించి సమ్మె చేస్తామని సోమవారం సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ కార్మికులతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటుందని, కాని వారికి జీతాలు చెల్లించే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. జీతాల మీద ఆధారపడి బతుకుతున్న కార్మికుల కుటుంబాలు నెలలు తరబడి వేతనాలు చెల్లించకపోతే ఎలా బతుకుతాయని ప్రశ్నించారు. పంచాయతీలో నిధులు లేవనే సాకుతో వేతనాలు చెల్లించకుండా ఉండటం సరికాదన్నారు. ఈ నెల 21వ తేదీలోగా వేతనాలు చెల్లించకుంటే 22 నుండి కార్మికులు సమ్మె చేస్తారని స్పష్టం చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ 21లోపు వేతనాలు చెల్లించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనందరాజు, రమేష్, రాములమ్మ, రాజమ్మ, శారదా, వెంకమ్మ, దుర్గ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అర్జున్ దొర

28న గిరిజన సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి ఎటపాక
గిరిజన సంఘం రంపచోడవరం జిల్లా మహాసభ ఈనెల 28న రంపచోడవరంలో జరుగుతుందని, దీనిని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కాక అర్జున్ దొర పిలుపునిచ్చారు. సోమవారం ఎటపాకలోని గిరిజన సంఘం ప్రాంతీయ కార్యాలయంలో సవలం రాము అధ్యక్షతన మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అర్జున్ దొర మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన తెగలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. విద్యా వైద్య, మౌలిక సదుపాయాల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. గిరిజనులకు ఉన్న చట్టాలను, జీవోలను అమలు చేయకుండా, కొత్తగా రాయలసీమ జిల్లాలకు చెందిన బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలోకి చేర్చుతూ 52జీవో జారీ చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే ఆ జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ మండల కార్యదర్శి ఇరపా అజయ్, నక్కా సూరిబాబు, ముర్రం వెంకటేష్, అపకా సమ్మక్క పాల్గొన్నారు.



పరీక్ష చేయించుకుంటున్న జెడ్‌పిటిసి గంగరాజు

మెగా వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- అనంతగిరి: మండల కేంద్రంలో సమిద పిరమిస్ట్ ల్యాండ్ ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ దిశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ సోమ్మెల. రూతు, జెడ్పిటిసి దీసరి గంగరాజు, ఎంపీపీ శెట్టి. నీలవేణిలు మెడికల్ క్యాంపును ప్రారంభించారు. వైద్యులు సోమేశ్వరరావు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, సమిధ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం చాలా సంతోషకరమని తెలిపారు. మారుమూల గిరిజన గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందక చాలామంది బాలింతలు, బాలికలు మృతి చెందుతున్నారన్నారు. ఎస్సై కె.రాము మాట్లాడుతూ, వైద్యంపై సరైన అవగాహన లేక పోవడంతోనే సకాలంలో వైద్య సేవలు పొందక చాలామంది మృత్యువాత పడుతున్నారన్నారు. 260. మంది రోగులు వైద్య సేవలు పొందారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖకు చెందిన వైద్యులు ప్రియాంక, దివ్యశిరిష, పాల్గొన్నారు.

సమస్యలపై స్టాపర్‌పేట గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి-చింతూరు
మండలంలోని కల్లేరు గ్రామపంచాయతీ పరిధి స్టాపర్‌పేట గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు సిపిఎం ఆధ్వర్యంలో చింతూరు ఐటిడిఏ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. దీనికి ముందు చింతూరు సిపిఎం కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని, స్టాపర్ పేట సూరనుగొందిలను రెవెన్యూ గ్రామాలుగా మార్చాలని, పంట బోర్లను రిపేర్ చేయించాలని, కల్లేరు నుండి మధుగురు వరకు బిటి రోడ్ నిర్మాణం చేపట్టాలని, గ్రామాలకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, అర్హులైన గిరిజనులకు సాగుభూమికి పట్టాలు ఇవ్వాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ధర్నా వద్దకు వచ్చిన ఐటిడిఎ పిఓ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. సమస్యలపై పిఓ సానుకూలంగా స్పందిస్తూ రోడ్డు నిర్మాణానికి వస్తున్న ఇబ్బందులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల అభివద్ధి కొరకు సబ్ ప్లాన్ నిధులను విడుదల చేయాలని కోరారు. ఏజెన్సీలోని అనేక గ్రామాలు నేటికీ రిజర్వ్ ఫారెస్ట్‌లోనే ఉన్నాయని, వాటిని రెవెన్యూ గ్రామాలుగా మార్చి మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. పాఠశాలలు, అంగన్వాడీలు భవనాలు శిథిలమవుతున్న భవనాల్లోనే కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, పాండు దుర్గారావు, కారం సీతయ్య, సాయం నారాయణ, సోడే బాబురావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా అనంతరం ఐటిడిఎ పిఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు, స్టాపర్ పేట గ్రామస్తులు



మహిళ చెబుతున్న సమస్యలను వింటున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

అంతాడలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి -కొయ్యూరు
మండలంలోని అంతాడ గ్రామ సచివాలయ పరిధిలోని అంతాడ, తాటిమానుపాలెం, మునసల, దోమలగొంది, కొత్తపల్లి, రాతిమామిడి గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి నిర్వహించారు. మొత్తం 336 గడపలకు భాగ్యలక్ష్మి వెళ్లి వారితో మాట్లాడారు. ఎవరైనా అర్హత ఉండి ఇప్పటి వరకూ ప్రభుత్వ పథకాలు పొందని వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, స్థానిక సర్పంచులు సుర్ల చందర్రావు, కురుజు పెంటమ్మ, వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, వైసిపి మండల అధ్యక్షుడు జల్లి బాబులు, పిఎసిఎస్ చైర్మన్ అప్పన గజ్జయ్యదొర, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రేగటి ముడిలినాయుడు, పంచాయితీరాజ్ డిఇ నరేన్ కుమార్, ఎంపిడిఓ మేరీ రోజీ, ఎఇ సిహెచ్.రామకృష్ణ, ఎంఇఓ బోడం నాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎల్‌పిఓ కుమార్

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

ప్రజాశక్తి-పాడేరుటౌన్: క్లాప్ మిత్ర సేవలను సక్రమంగా వినియోగించుకోవాలని డిఎల్‌పిఓ పిఎస్ కుమార్ సూచించారు. మండలంలోని కిండంగి, మినుములూరు ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. గుత్తులపుట్టు సంత వద్ద ఉన్న చెత్తను ప్రోక్లైనర్‌తో తొలగించి కాలువల పూడిక తీయాలని సెక్రటరీ మత్స్యరాజు, సత్యనారాయణను ఆదేశించారు. మంచినీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని సూచించారు.

స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే

ప్రజాశక్తి -రంపచోడవరం
ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యలపైనా, వ్యక్తిగత సమస్యలపైనా స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటిడిఎ ఎపిఓ సిహెచ్.శ్రీనివాసరావు ఇతర అధికారులతో కలిసి పిఓ స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధించిన దరఖాస్తులు, ఉద్యోగాలు అవకాశాలు కల్పించాలని, వ్యక్తిగత సమస్యలపైనా దరఖాస్తులు 60 వరకు వచ్చాయి. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ అధికారులు పరిష్కరించగలిగే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజు, ఎండి యూసఫ్, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, ఐటీడీఏ పరిపాలన అధికారి డిఎన్‌వి.రమణ, డాక్టర్ సతీష్, డాక్టర్ రాధిక, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

వైద్య సహాయం చేయాలని వినతి

ప్రజాశక్తి-మారేడుమిల్లి: మండలంలోని జిఎం.వలస గ్రామానికి చెందిన మొట్టెం శివశంకర్ వరప్రసాద్ దొర (22) గత నాలుగు సంవత్సరాలుగా బ్రెయిన్ టీబీతో 90 శాతం అంగ వైకల్యంతో బాధపడుతున్నాడని,. ఆయన వైద్యం కోసం సహాయం చేయాలని సోమవారం రంపచోడవరం ఐటిడిఎలో జరిగిన స్పందన కార్యక్రమంలో పీవో సురజ్ గానోరేకు వినతి పత్రాన్ని అందజేశారు. వరప్రసాద్‌ను తల్లి దండ్రులు కాకినాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం ఇలా పలు ప్రాంతాలలోని హస్పటల్లో వైద్య పరీక్షలు చేయించినా ఫలితం లేదన్నారు. ఆర్థిక పరిస్థితి సరిపోక వైద్య సేవలు చేయించుకోలేని స్థితులో ఉన్న తల్లిదండ్రులు ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య సేవలకు సహాయం చేయాలని, వికలాంగు ఫించన్ ఇప్పించాలని కోరారు. దీనికి ప్రాజెక్ట్ అధికారి స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి మెరుగైన వైద్య సేవలు కోసం అడిషనల్ డిఎం అండ్ హెచ్‌ఓకు అప్పజెప్పారు.



పిఒకు వినతిపత్రం ఇస్తున్న రోగి బంధువులు

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి- సీలేరు
కార్తీక మాసం మూడో సోమవారం కావడంతో జీకే వీధి మండలం, సీలేరు శివాలయానికి భక్తులు పోటేత్తారు. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు నదీ స్నానం ఆచరించి కోలాహలంగా శివాలయానికి చేరుకొని శివునికి పంచామతలతో అభిషేకాలతో నిర్వహించారు. లక్ష పత్రి పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి వారి భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ప్రజల సహకారంతో ఆలయ కమిటీ అన్నదానాన్ని ఏర్పాటు చేశారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - పెదబయలు :మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలలో స్థానిక గిరిజన గురుకులం బాలురు విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ డి.శంకర్రావు, పిఇటి డి.రాంబాబు సోమవారం తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు పొట్టంగి సాయి నవదీప్ (కోకో) బిసోయి సిద్ధార్థ (త్రో బాల్) కిముడు మురళి కార్తీక్ (100 మీటర్స్ రన్నింగ్) ఎంపిక అయ్యారని తెలిపారు. వీరికి అభినందనలు తెలిపారు.



శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

'నాడు - నేడు' పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని కొండిభ పంచాయతీ పరిధి సిసమండ పాఠశాలలో వివిధ పనులు నాడు నేడు కింద చేసేందుకు సర్పంచ్ పి పున్నమ్మ, జెడ్పిటిసి దిసరి గంగరాజు, ఎంపీపీ శెట్టి. నీలవేణి సోమవారం శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిసమండ ప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వం రూ. 25 లక్షలు నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులతో పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో మొస్య, నాయకులు దొన్ను, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

సొసైటీగా మధురవాడ పిఎసిఎస్ ?

ప్రజాశక్తి -మధురవాడ : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పిఎసిఎస్) త్వరలో క్రెడిట్ సొసైటీగా సేవలందించనుంది. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది. సుమారు 50 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ పిఎసిఎస్ ద్వారా ఒకప్పుడు మధురవాడ పరిసరాల్లోని 20 గ్రామాల రైతులకు సేవలందేవి. అప్పట్లో వ్యవసాయమే జీవనాధారం కావడంతో రైతుల కోసం ఈ పిఎసిఎస్‌ను ప్రారంభించారు. కాలక్రమంలో మధురవాడ పరిసరాల్లో వ్యవసాయం కనుమరుగైంది. పిఎసిఎస్ సభ్యుల సంఖ్య కూడా తగ్గింది. దీంతో పిఎసిఎస్ నుంచి రుణాలు, ఎరువులు, విత్తనాల సరఫరా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో పదేళ్ల క్రితం నుంచి దీన్ని క్రెడిట్ సొసైటీగా మార్పుచేయాలని ఆ సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత నెలలో జరిగిన సొసైటీ మహాజన సభలో కూడా సభ్యులంతా క్రెడిట్ సొసైటీగా మార్పు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ప్రస్తుతం దీనిపై కదలిక వచ్చినట్లు తెలిసింది. ఫైల్ డివిజనల్ స్థాయి అధికారి నుంచి గుంటూరు వెళ్లినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అక్కడ ఆమోదంకాగానే ఉత్తర్వులు రానున్నాయి. ఈ ప్రక్రియ నెల రోజుల్లో పూర్తి కానున్నట్లు తెలిసింది. క్రెడిట్ సొసైటీగా మార్చితే అర్బన్ బ్యాంకులో జరిగే కార్యకలాపాలన్నీ ఇక్కడ కూడా జరగనున్నాయి. హౌసింగ్, వ్యక్తిగత వాహన రుణాలతో పాటు అధిక వడ్డీకి డిపాజిట్లు కూడా స్వీకరిస్తారు.

అంగన్‌వాడీ కేంద్రాలను మెరుగుపరచాలి

సూపర్‌వైజర్లు, సిడిపిఒలు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు :అంగన్వాడి కేంద్రాలు మెరుగుపడే విధంగా సూపర్వైజర్లు, సిడిపిఓలు, మహిళా పోలీసులు ఆరు నెలల పాటు గట్టిగా పని చేస్తే మార్పు వస్తుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అరకు నియోజక వర్గం పరిధిలోని ఐసిడిఎస్ అధికారులు, మహిళా పోలీస్‌లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల్లో సచివాలయాల మహిళా పోలీస్ పాత్ర చాలా ముఖ్యమైందని, రేషన్ షాపులు, ఎం.ఎల్.ఎస్ పాయింట్లు సందర్శించాన్నారు. అంగన్వాడి సూపర్వైజర్లు, ఆయాలు, హెల్పర్లకు సహకరించాలని సూచించారు. జిల్లాలో బరువు, ఎత్తు తక్కువున్న పిల్లలు, హైరిస్క్ గర్భిణీలు, రక్త హీనతతో భాద పడేవారు ఎక్కువగా ఉన్నారని, అటువంటి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు. ఆరు నెలల నుండి 36 నెలల పిల్లలకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రక్త హీనతతో బాధ పడుతున్న వారిని, హై రిస్క్ గర్భిణీలను గుర్తించి సరైన అవగాహన కల్పించి, క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోనేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అధికంగా మహిళా పోలీసులు గర్భిణీల, బాలింతల భాద్యతను తీసుకోవాలని సూచించారు. మాతా, శిశు మరణాల నివారణలో మహిళా పోలీస్‌ల పాత్ర కీలకమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని గర్భిణీలు, బాలింతలకు వారి ఇంటికే పౌష్టికాహారం పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. సచివాలయ సందర్శనలో మహిళా పోలీసులు గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న సేవలపై రికార్డుల తనిఖీ చేస్తానని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పరిశీలనలో లోపాలు కనబడితే షోకాజ్ నోటీసు బదులు, వారి సర్వీస్ రిజిస్టర్లలో రెడ్ మార్క్ ఎంట్రీ నమోదు చేస్తానని హెచ్చరించారు. అంగన్వాడి కేంద్రాలకు రాని పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో, సర్పంచ్‌తో మాటాడి రప్పించాలని ఆదేశించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సమస్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.సుపెర్వైజర్ వీలైనన్ని అంగన్వాడి కేంద్రాలు సందర్శించాలని ఆదేశించారు. ఈ సమావేశం లో శిక్షణ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఐసిడిఎస్ పథక సంచాలకులు సూర్యలక్ష్మి, అరకు నియోజక వర్గం పరిధిలోని అనంతగిరి, అరకు, దుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచింగిపుట్టు మండ లాల ఎంపిడిఒలు, ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపెర్వైజర్లు, ఆయా మండలాల మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

జిసిసి పెట్రోల్ బంకుల్లో....

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించండి : సిఐటియు




మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని జిసిసి పెట్రోల్ బంకుల్లో పని చేస్తున్న కార్మికులకు (పంపు బాయ్స్) ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో పెట్రోల్ బంకుల కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిసిసి పెట్రోల్ బంకుల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు తొమ్మిది సంవత్సరాల నుండి కార్మికులు వందమంది వరకు జిసిసి బంకుల్లో పని చేస్తున్నారని, నేటి వరకు కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు లేవని తెలిపారు. జిసిసి కార్మిక చట్టాలను, హక్కులను అమలు చేయలేదని తెలిపారు. కనీసం సెలవులు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారని విమర్శించారు. కనీస వేతనం రూ.26,000, సంవత్సరానికి రెండు జతల యూనిఫార్మ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని బంకుల్లో మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యలపై కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వంతల రంగారావు, కిలో శ్రీకాంత్, వెలుగురు శ్రీనివాసరావు, సత్యనారాయణ, లకే రామచంద్రరావు, వంతల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో ప్రసాద్ సత్తా

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండలంలోని పెదగూడ పంచాయతీ జర్రిపడా గ్రామానికి చెందిన కూర్తాడి ప్రసాద్ ఈనెల 12,13 తేదీలలో జరిగిన స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ (విశాఖపట్నం జిల్లా ఉక్కునగరం ఉక్కు స్టేడియం) లో రన్నింగ్ పోటీలో సత్తా చాటాడు. 800మీటర్ల రన్నింగ్‌లో రెండవ స్థానం (సిల్వర్ మెడల్), 1500మీటర్ల రన్నింగ్‌లో మొదటి స్థానం (గోల్డ్ మెడల్) సాధించాడు. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఆడనున్నాడు. ఈ పోటీలకు వెళ్లేందుకు తనకు ఆర్థిక సహాయం చేయాలని కోరాడు.



ప్రసాద్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- పెదబయలు:ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ రఘువర్మ తెలిపారు. స్థానిక గిరిజన బాలుర పాఠశాలను ఆయన సందర్శించారు. ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. సిఆర్‌టిల వేతనాలు పెంచాలని మండలిలో తప్పకుండా ప్రస్తావిస్తానని ఎమ్మెల్సీ తెలిపారు. ఉద్యోగం భద్రత, తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల గౌరవ అధ్యక్షులు ఏస్‌బిఎల్ స్వామి, జె మాలంనాయుడు, జిల్లా అధ్యక్షులు జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

కాంగ్రెస్ ఆధ్వర్యాన 'ప్రజాదర్బార్'



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-పెదబయలు: అరకు వేలి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పాచిపెంట శాంతకుమారి ఆదేశాల మేరకు పెదబయలు సంత వద్ద ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొర్ర కోమటి ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తగ్గించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరశురాం, కొర్రకొండ బాబు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-జిమాడుగుల:మండల కేంద్రంలోని సచివాలయంలో సోమవారం వివిధ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తారణ అధికారి ప్రకాష్ మాట్లాడుతూ, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి రోగులను పరీక్షించాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

డిసెంబర్ 17న
గీతం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2001 సంవత్సరం నుంచి 2007 సంవత్సర కాలంలో వివిధ కోర్సులు అభ్యసించి దేశ, విదేశాలలో స్థిరపడిన పూర్వవిద్యార్థులకు డిసెంబర్ 17న "హోమ్ కమింగ్-2022" పేరిట అంతర్జాతీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ తెలిపారు. 42 సంవత్సరాల గీతం సుదీర్ఘ చరిత్రలో దాదాపు లక్ష మందికి పైగా విద్యార్థులు వివిధ కోర్సులను పూర్తిచేసి ప్రముఖ సంస్థలలో కీలక స్థానాలకు ఎదిగారని, అమెరికా తదితర దేశాలలో గీతం పూర్వ విద్యార్థి సంఘాలు చైతన్యవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకం వహించడంతో పాటు సిలబస్ రూపకల్పనలో నూతన అంశాలపై పూర్వ విద్యార్థుల విలువైన సూచనలు పరిగణలోకి తీసుకుంటున్నామన్నారు. పూర్వ విద్యార్థుల కోసం ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పామని తెలిపారు. ప్రతి సంవత్సరమూ గీతంలో వివిధ కోర్సులు పూర్తిచేసి వెళ్ళే విద్యార్థులకు ప్రత్యేక ఐడి కార్డులను జారీచేస్తున్నామని చెప్పారు. గీతంలోని గ్రంథాలయం, ఇతర మౌలిక సదుపాయాలు పూర్వ విద్యార్థులు ఉపయోగించుకునేలా ఐడి కార్డు ఉపకరిస్తోందన్నారు. 2019లో నిర్వహించిన "గీతం హోమ్ కమింగ్" ఉత్సవానికి 1500 మందికి పైగా పూర్వ విద్యార్థులు హాజరయ్యారని, ఈ ఏడాది ఆ సంఖ్య రెట్టింపుగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది "హోమ్ కమింగ్-2022"లో భాగంగా క్రీడా, సాంస్కృతిక పోటీలు, గీతం సందర్శన, అధ్యాపకులతో ముఖాముఖి, భవిష్య ప్రణాళికపై చర్చలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన దలచిన పూర్వవిద్యార్థులు గీతం వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 784250045ను సంప్రదించాలని సూచించారు.

18న మల్కన్‌గిరి, కోరాపుట్ జిల్లాల బంద్

- బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టు పార్టీ పిలుపు

ప్రజాశక్తి - సీలేరు : ఆంధ్ర ఒడిశా సరిహద్దు బైపరిగూడ బ్లాక్ అటల్‌గూడ మాలిపొదర్, బదిలిపార గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో ఈనెల 10న జరిగిన పోలీసు ఎన్‌కౌంటర్ బూటకమని మావోయిస్టు పార్టీ మల్కన్‌గిరి, కోరాపుట్టు బోర్డర్ డివిజన్ కమిటీ కార్యదర్శి రాకేష్ సోమవారం విలేకరులు పంపిన ఆడియో టేపులో పేర్కొన్నారు. ఈ కాల్పుల్లో ఇద్దరు సాధారణ కూలీలను పోలీసులు హతమార్చారని, దీనిపై నిజ నిర్ధారణ కమిటీ వేసి దోషులను కఠినంగా శిక్షించాలని, బాధితుల కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈ నెల 18న నిర్వహిస్తున్న మల్కన్‌గిరి, కోరాపుట్ జిల్లాల బంద్ విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్‌కౌంటర్ స్థలంలో మావోయిస్టుల సామాగ్రి స్వాధీనం చేసుకున్నామని పోలీసులు ఫొటోలు, వీడియోలు తీసి అసత్య ప్రచారం చేశారని మండిపడ్డారు. వాస్తవానికి అక్కడ మావోయిస్టులు ఎవరూ లేరని, అక్కడ చనిపోయినది మథిలి బ్లాక్, నరగిగూడ గ్రామానికి చెందిన ధోనోకమర్‌తో పాటు మరో సాధారణ కూలీ అని తెలిపారు. వీరు బతుకుతెరువు కోసం గంజాయి వ్యాపారుల వద్ద పని చేసే కూలీలు మాత్రమేనని చెప్పారు. తమ తప్పిదాలను తప్పించుకోవడానికి పోలీసులు మావోయిస్టులపై కాల్పులు జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అత్యంత అమానుషంగా కాల్చి చంపుతున్న పోలీసుల చర్యలకు అధికార బిజెడి పూర్తి బాధ్యత వహించాలన్నారు. కూంబింగ్‌ల పేరుతో ఆదివాసీలపై పోలీసులు జరుపుతున్న హత్యలను, అమానుష్య చర్యలను ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థులు, మేధావులు ఖండించాలని రాకేష్ విజ్ఞప్తి చేశారు.



సామగ్రిని అందిస్తున్న సిఆర్‌పిఎఫ్ సిబ్బంది

సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యాన సివిక్ యాక్షన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - చింతూరు : మండలంలోని ఏడుగురాళ్ళపల్లి, పేగ పంచాయతీలలో సోమవారం రోజు సిఆర్‌పిఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్ దర్, బెటాలియన్ (ఓసి) నందలాల్ తివారీ ఆధ్వర్యాన సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం గిరిజనులైన 60 మందికి పారలు, గడ్డ పలుగులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ వచ్చిన ఆదివాసీ గిరిజనులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన పుంగుట్ట, అల్లివాగు గ్రామాలలో నాలుగు సోలార్ లైట్లును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చింతూరు సిఐ అప్పలనాయుడు, సిఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ పసుపులేటి కాశయ్య, ఎస్ఐ యాదగిరి, గ్రామ సర్పంచులు సవలం సత్తిబాబు, చంద్రయ్య, వైస్ ఎంపీపీ ఎడమ అర్జున్, ఉపాధ్యాయులు, సిఆర్పిఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయులో మొక్కల పెంపకం కోసం వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రధాని మోడీ పర్యటన, బహిరంగ సభ నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తొలగించిన వృక్షాల స్థానంలో మొక్కల పెంపకం చేపట్టాలని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం స్పందనలో జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

నెహ్రూను మరిచారా ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి విశాఖలో ఘోర అవమానం జరిగిందని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ ఆరోపించారు. సోమవారం ఆర్‌కె బీచ్‌లోని నెహ్రూ విగ్రహం వద్ద ఆయన ఆందోళన చేపట్టారు. నెహ్రూ జయంతి రోజున ప్రభుత్వం తరపున ఎవరూ నివాళులు అర్పించేందుకు రాకపోవడం శోచనీయమన్నారు. విశాఖలోనే ఉంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ భారత తొలి ప్రధానిని విస్మరించడం దారుణమన్నారు. నెహ్రూ విగ్రహాన్ని పట్టించుకోని అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

తూతూ మంత్రంగా సమగ్ర సర్వే

పరికరాలు ఇవ్వకుండానే మండల రెవెన్యూ అధికారులపై ఒత్తిళ్లు

మ్యాన్యువల్‌గా భూములు కొలవాలని హుకుం

ప్రభుత్వ తీరుపై విమర్శలు

ప్రజాశక్తి - పరవాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంతో భూ వివాదాలు పరిష్కారమవుతాయని నిన్నమొన్నటి వరకూ అధికారులు ఢంకాబజాయించారు. వందేళ్ల తర్వాత చేపడుతున్న ఈ రీ సర్వేతో ఎంతో మేలు జరుగుతుందని ప్రభుత్వం ఊదరగొట్టింది. ఒక్కో మండలంలో సర్వే నిర్వహణకు నాలుగు నెలలు పట్టనుందని, సర్వే సమయంలో వచ్చే భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక మొబైల్ కోర్టులను ఏర్పాటు చేస్తామని సిఎం జగన్మోహన్ రెడ్డి కూడా చెప్పారు. అత్యాధునిక సర్వే యంత్రాలతో సర్వే చేసిన ప్రతి భూమికి యూనిట్ నెంబర్ ఇవ్వడంతో ఆ భూమికి సంబంధించిన అన్ని వివరాలు అధికారికంగా నమోదవుతాయని, భూ వివాదాలకు ఆస్కారం లేకుండా ఉంటుందని ఆయన ఉన్నతాధికారులుతో పలు భూ సర్వే సమీక్షల్లో చెప్పుకొచ్చారు. అయితే, వాస్తవం వేరుగా ఉంది. మండలాల్లో ఈ భూసర్వే తూతూ మంత్రంగా సాగుతోంది.



ఇ.బోనంగిలో మ్యాన్యువల్ సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

ఒక మండలంలో సమగ్ర సర్వే జరగాలంటే డ్రోన్లు, ఒఆర్ఐ పరికరాలు, రోవర్లు, సర్వే రాళ్లు సమకూర్చుకోవాలి. అప్పుడు సర్వే జరపాలి. కానీ అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో సర్వే పరికరాలు ఇవ్వకుండానే మండల స్థాయి రెవిన్యూ అధికారులపై జిల్లా స్థాయి అధికారులు ఒత్తిళ్లు తెచ్చి తూతూ మంత్రంగా రీ సర్వే జరిపిస్తున్నారు. పరికరాలు లేని చోట మ్యాన్యువల్‌గా భూములు కొలవాలని జిల్లా అధికారులు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. పరవాడ మండలంలో మొత్తం 18 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఈ సమగ్ర సర్వే వల్ల మండలాధికారులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. మండల పరిధిలో ఉన్న రెండో ఫేజ్‌లో 9 రెవెన్యూ గ్రామాల్లో ఒకే సారి సమగ్ర రీ-సర్వే మొదలు పెట్టాలని జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లుఉన్నాయని మండల రెవెన్యూ అధికారులు హడలిపోతున్నారు. ఏదో ఒక విధంగా రీ-సర్వే మొదలు పెడదాం అనుకుంటే మండలం మొత్తానికి ఒకే డ్రోన్, అరకొర పరికరాలు ఉన్నాయి. మండలంలో రెండో ఫేజ్‌లో నిర్ణయించిన తానాం, భర్నికం, పిఎస్.బోనంగి, పిఆర్.బోనంగి, ఇ.బోనంగి, కలపాక, పెదముషిడివాడ, కన్నూరు, పరవాడ, వెన్నెలపాలెం రెవిన్యూ గ్రామాల్లో ఈ అరకొర పరికరాలతోనే సర్వేకు సిద్ధమయ్యారు. అందులో మూడు రెవెన్యూ గ్రామాల్లో సర్వే యంత్రాలతోనూ, మిగతా ఆరు రెవెన్యూ గ్రామాల్లో మ్యాన్యువల్ పద్ధతిలోనూ భూములను కొలుస్తున్నారు. దీంతో మండల రెవెన్యూ అధికారులు, ఇతర సిబ్బంది తీవ్ర పని ఒత్తిడికి గురౌతున్నారు. మండలం మొత్తానికి ఒక డ్రోన్, అరకొర పరికరాలు అందించి ఒకేసారి అన్ని రెవెన్యూ గ్రామాల్లో రీ-సర్వే ఎలా చేయాలని కొంతమంది అధికారులు ప్రభుత్వంపై బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు రైతుల్లో అయోమయం నెలకొంది. రీ సర్వేలో లోపాలు ఉన్నాయని ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే సర్వే కోసం ఖర్చు పెట్టిన ప్రభుత్వ ధనం వృథాగా పోతుందనే వాదనలు కూడా పలువురి నుంచి వినిపిస్తున్నాయి. కాబట్టి ప్రభుత్వం, జిల్లా స్థాయి అధికారులు ఇప్పటికైనా స్పందించి సమగ్ర సర్వేకు పూర్తి స్థాయిలో సర్వే పరికరాలను అందించి, ఆ తరువాతనే గ్రామాల్లో సర్వే మొదలు పెట్టాలని కోరుతున్నారు.

రోజుకు 20 ఎకరాల సర్వే

మండలంలో మూడు చోట్ల మెషిన్ ద్వారా సర్వేలు చేపడుతున్నాం. మిగిలిన ఆరు చోట్లా ముందుగా మ్యాన్యువల్ సర్వే చేస్తాం. తరువాత రోవర్ల ద్వారా సర్వే నిర్వహించి సరిహద్దు రాళ్లు వేస్తాం. రోజుకు 20 ఎకరాలను సర్వే చేయాల్సి ఉంది.

వి.ప్రకాశరావు, తహశీల్దార్

పోలీస్ స్పందనకు 37 వినతులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పోలీస్ స్పందన కార్యక్రమానికి సోమవారం 37 వినతులు వచ్చాయి. ఫిర్యాదులను ఎడిసిపి (అడ్మిన్) ఎంఆర్‌కె.రాజు పరిశీలించారు. సిపి సిహెచ్.శ్రీకాంత్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

బాలల హక్కుల పరిరక్షణ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస్ ఫౌండేషన్ రూపొందించిన పోస్టర్‌ను సోమవారం ఆంధ్ర యూనివర్సిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్ విభాగాధిపతి డివిఆర్.మూర్తి ఆయన ఛాంబర్‌లో ఆవిస్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 20 వరకు వివిధ ప్రాంతాలలో బాలల హక్కులపై కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాబ్జీ, డాక్టర్ చల్లా రామకృష్ణ, డాక్టర్ సిఎం.వినయ్ కుమార్ పాల్గొన్నారు.

మోడీ, పవన్ ఏం మాట్లాడుకున్నారు..?

- వారి భేటీ వెనుక 'గేమ్ ప్లాన్'పై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల 11వ తేదీ రాత్రి విశాఖలోని ఐఎన్ఎస్ చోళాలో దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మధ్య జరిగిన భేటీ తాజాగా విశాఖలోనూ, ఎపి అంతటా చర్చ జరుగుతోంది. రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్నవారు... లేనివారు అంతా ఈ అంశంపైనే దృష్టిసారించడం సహజమైన విషయమే. అయితే మోడీతో పవన్ ఏం చెప్పి ఉంటారు ?. మోడీ ఎలా స్పందించి ఉంటారు ? రాష్ట్రంలో పరిస్థితులు మోడీకి వివరించానని పవన్ బయటకొచ్చి మీడియా సమావేశంలో చెప్పిన సంగతి తెలిసిందే. అయితే, ఏం మాట్లాడారన్నది పవన్ బయట వెల్లడించకపోవడంతో అందరి దృష్టినీ ఈ భేటీ ఆకర్షించినట్టయింది. రాష్ట్రంలో పవన్ ఎక్కడికి వెళ్లినా వైసిపి శ్రేణులు ఏదో ఒక రకంగా ఆయన పర్యటనకు ఆటంకం కలిగించడం, విశాఖ పర్యటననూ అడ్డుకోవడం గురించి తెలిసిందే. తాజాగా జనసేన - వైసిపిల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ వాతావరణం కొనసాగుతున్న క్రమంలో ఈ భేటీ జరిగినందున మోడీకి రాష్ట్రంలో వైసిపి పాలన, జగన్ పాత్రపై పవన్ కల్యాణ్ గట్టిగానే చెప్పి ఉంటారన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఆ మరుసటి రోజునే అంటే 12న ఏయూ గ్రౌండ్స్‌లో ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలసి ఒక వేదిక నుంచి ప్రసంగించారు. అదేరోజు సాయంత్రం పవన్‌కల్యాణ్ రుషికొండ ప్రాంతాన్ని తమ పార్టీ శ్రేణులతో సందర్శించారు. కానీ జగన్ వెళ్లాక పవన్ నోరు విప్పలేదు. ఈ నేపథ్యంలో మోడీతో జరిగిన సంభాషణలో ఆయనకు ఈయన చెప్పిన విషయాలపై ఎలా స్పందించారు ? అసలేం చెప్పారన్నది అందరిలోనూ చర్చ సాగుతోంది.

మూడు ప్రధాన పార్టీలకూ సంకేతాలెళ్లినట్టేనా?

2024 ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి వ్యతిరేక ఓట్లు చీలకుండా జాగ్రత్తపడేందుకు బిజెపి, తెలుగుదేశం, జనసేన పనిచేసేలాగ కృషిచేస్తానంటూ పదేపదే పవన్ కల్యాణ్ పలు వేదికల్లో చెప్పిన సంగతి తెలిసిందే. మోడీతో భేటీ తర్వాత మాత్రం ఈ మాట ఎక్కడా వినపడంలేదు. ఎందుకంటే పవన్ ఇంకా బిజెపి చట్రంలోనే బిగుసుకుని ఉన్నారు. అంతేగాక వైసిపిని ఒక లైన్‌లోనూ.. తెలుగుదేశం పార్టీని మరో లైన్‌లోనూ బిజెపి నిలబెట్టిందన్నది రాజకీయ విశ్లేషకుల నుంచీ వ్యక్తమవుతోంది. ఇదిలా వుండగా బిజెపి, వైసిపి రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో కలిసే ప్రయాణం చేసే సంకేతాలుగా విశాఖలో మోడీ పర్యటన, సభా ఏర్పాట్లలో వైసిపి నాయకత్వం పూర్తిగా నిమగ్నం కావడం తెలిసిందే. అసలు బిజెపి గేమ్ ప్లాన్ వేరేగా ఉందని, ఆ విషయం పవన్‌తో చర్చల్లో బయటపడిందన్నది తెలుస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి తెలుగుదేశం పార్టీని ఎంత దూరం వుంచితే తర్వాత అంటే 2029 నాటికి జనసేన బలపడే అవకాశాలు ఉంటాయన్న అవగాహన భేటీ అనంతరం వచ్చిందా ? అన్న అనుమానాలు వెల్లడవుతున్నాయి. అలాగే వైసిపి గంతులేస్తే పక్కనే బల్లెంలాగ పవన్ కూడా తమతో ఉన్నాడని చెప్పే యత్నాలకు విశాఖ వేదికగా బిజెపి ఒక సంకేతం పంపిందన్నది వైసిపి శ్రేణుల నుంచీ వ్యక్తమవుతోంది. మోడీ గేమ్‌ప్లాన్ ఇదే అయితే పవన్ వైసిపి పట్ల గతంలో మాదిరిగా విరుచుకుపడతారా ? అన్నది అనుమానమే. చంద్రబాబును, టిడిపిని రాష్ట్రంలో ఎన్నికల్లో పాలన అంచుల దగ్గరకు రాకుండా మోడీ స్కెచ్‌ను పవన్‌కు చూపించాడా ?.. మొత్తానికి ఏమైతేనేమీ పవన్‌ను ఆశల పల్లకిలో ఊరిస్తూ.. చంద్రబాబును దూరం పెడుతూ, వైసిపికి హెచ్చరిక సంకేతాలను మోడీ పంపారన్నది ఎక్కువ మందిలో చర్చగా ఉంది.

సమస్యలపై సచివాలయ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గ్రామ వార్డు సచివాలయం 2వ ఫేజ్ లో జాయిన్ అయిన, ప్రొబేషన్ పూర్తి కాని, పోలీస్ వెరిఫికేషన్ పూర్తి కాని ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లరేషన్‌ను వేగవంతం చేయాలని గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ పివి.కిరణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సోమవారం జివిఎంసి కమిషనర్ రాజబాబుకు ఫెడరేషన్ తరపున కిరణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు పిజె.గణేష్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బివి.అశోక్ కుమార్, ఆనందరావు, ఎర్రాజీ, పల్లా ఆనంద్, జివి.కుమార్, ఆర్.సత్యం వినతి పత్రం సమర్పించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లాసన్స్ బే కాలనీలోగల మానసిక వికలాంగుల హిడెన్ స్ప్రౌట్స్ ప్రత్యేక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గురుస్థానం ది ప్లే స్కూల్ డైరెక్టర్ ఎస్.ఖాన్ మానసిక వికలాంగులకు నిత్యావసర సరుకులు అందజేశారు. నవభారత నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమని, దానికి తగిన విధంగా సృజనను, మేధస్సును పెంపొందించుకోవాలని ఉద్బోధించారు. పాఠశాల నిర్వాహకులు శ్రీనివాసరావు, గురుస్థానం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషా పాల్గొన్నారు.